సాక్షి
మంచిర్యాల

శుక్రవారం ; 8 ; నవంబర్ ; 2024

రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలి

బెల్లంపల్లిరూరల్: రైతులు పంటల సాగులో జాగ్రత్తలు పాటించి ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ అన్నారు. గురువారం మండలంలోని బుచ్చయ్యపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఏఓ జి.కల్పన, జిల్లా సహకార అధికారి సంజీవ్ పలు అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. బెల్లంపల్లి ఆర్డీవో పి.హరికృష్ణ, ఏడీఏ రాజనరేందర్, తహసీల్దార్ జోత్స్న, పీఏసీఎస్ చైర్మన్ స్వామి పాల్గొన్నారు.



నాణ్యమైన భోజనం వడ్డించాలి

భీమిని: విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కన్నెపల్లిలోని కేజీబీవీ, ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ తనిఖీ చేశారు. తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు పరిశీలించారు.

గరిష్టం/కనిష్టం
31.0 /20.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వాయువ్యం దిశగా గాలులు వీస్తాయి. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

విద్యార్థులు దేశాభివృద్ధికి తోడ్పడాలి



మాట్లాడుతున్న అర్పిత మారంరెడ్డి

మంచిర్యాలక్రైం: విద్యార్థులు దేశాభివృద్ధికి తోడ్పడాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గర్ల్స్ ఉన్నత పాఠశాలలో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాలల హక్కులు, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. చెడు అలవాట్లు, చెడు స్నేహితులకు దూరంగా ఉండాలని అన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికలను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సహాయం కోసం 15100 నంబర్‌కు ఫోన్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు విద్యార్థులు పాల్గొన్నారు.

డీటీడీఓ గంగారాం సస్పెన్షన్

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని మంచిర్యాల బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరిన ఘటనలో డీటీడీఓ గంగారాంను అధికారులు గురువారం సస్పెండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం కారణంగా హెచ్‌ఎంను సస్పెండ్ చేయగా.. పర్యవేక్షణ లోపంపై గంగారాంను సస్పెండ్ చేసినట్లు తెలుస్తోంది.

వార్డెన్‌ను విధుల నుంచి తొలగించాలి

పాఠశాలలో విద్యార్థినుల అస్వస్థత ఘటనపై విచారణ చేపట్టాలని, వార్డెన్ లక్ష్మీరాజ్‌ను విధుల నుంచి తొలగించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ డిమాండ్ చేశారు. గురువారం వసతిగృహాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. హెచ్‌ఎంను సస్పెండ్ చేసి వార్డెన్‌పై చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు.

ఆస్పత్రిలో మందుబాబుల శుభ్రత పనులు



పనులు చేస్తున్న మందుబాబులు

మంచిర్యాలక్రైం: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన మందుబాబులు కోర్టు శిక్షలో భాగంగా గురువారం మంచిర్యాల మాతాశిశు కేంద్రం ఆస్పత్రి ఆవరణలో పరిశుభ్రత పనులు చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 27మంది ఆస్పత్రిలో శుభ్రత పనులు చేయాలని శిక్ష విధిస్తూ మొదటి అదనపు సివిల్ జడ్జి ఉపనిషధ్వని బుధవారం తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. సీఐ సత్యనారాయణ, ఏఎస్సై నందగోపాల్, కానిస్టేబుల్ శ్రీనివాస్ వారితో ఆస్పత్రి ఆవరణలో పిచ్చిమొక్కలు, చెత్త తొలగింపు పనులు చేయించారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పనిచేశారు. వారం రోజులపాటు ఆస్పత్రి పరిసర ప్రాంతాలను శుభ్రం చేయిస్తామని సీఐ తెలిపారు.

సర్వర్ సమస్యతో నిలిచిన మద్యం సరఫరా

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేట లిక్కర్ గోదాము నుంచి రెండ్రోజులుగా మద్యం సరఫరా నిలిచిపోయింది. మద్యం నిల్వలు, సరఫరా చేసే ఆన్‌లైన్ వ్యవస్థకు సంబంధించి సర్వర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడమే కారణంగా తెలుస్తోంది. గుడిపేట లిక్కర్ గోదాము ద్వారా రోజుకు రూ.కోట్లలో మద్యం నిల్వల సరఫరా జరుగుతోంది. సర్వర్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య గురువారం పరిష్కారం కావడంతో బార్లు, మద్యం దుకాణాలకు మద్యం సరఫరా యథావిధిగా కొనసాగింది. ఒక్క రోజులో రూ.5 కోట్ల వరకు మద్యం సరఫరా జరిగినట్లు సమాచారం.

బెల్లంపల్లిలో రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని సింగరేణి తిలక్ స్టేడియంలో ఈ నెల 9, 10వ తేదీల్లో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నారు. డీఐఈవో కే.అంజయ్య గురువారం పోటీల ఏర్పాట్లు, మైదానం పరిశీలించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 విభాగంలో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తారు. రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల నుంచి సుమారు 320 మంది క్రీడాకారులు హాజరవుతారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.బాబురావు, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ప్రిన్సిపాల్ ఏ.అంజయ్య, రాంమ్మోహన్, బండి రవి, ఎస్కే రాజ్‌మహ్మద్, ఎండి.చాంద్‌పాషా, హరి, సాయి తదితరులు పాల్గొన్నారు.

బోర్డు తిప్పేస్తున్నారు!

- నాన్ బ్యాంకింగ్ సేవలంటూ స్థాపన
- రూ.లక్షలు సేకరిస్తూ సామాన్యులకు టోకరా
- ఏడాదిలోనే మూతపడ్డ ఫినోసిటీ నిధి సంస్థ
- కార్యాలయం చుట్టూ డిపాజిటర్ల ప్రదక్షిణ



మూత పడిన ఫినోసిటీ కార్యాలయం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఆర్థిక సంస్థల పేరుతో ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తూ బోర్డు తిప్పేస్తుండడంతో సామాన్యులు నష్టపోతున్నారు. డిపాజిట్లకు అధిక వడ్డీ, రుణాలు తదితర ఆశ చూపించి నమ్మిస్తూ నట్టేట ముంచేస్తున్నారు. దీంతో రూ.లక్షలు పెట్టి చివరికి మోసపోతూ కార్యాలయాలు, నిర్వాహకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే అనేక ఆర్థిక మోసాలు బయటపడ్డాయి. జిల్లాలో గతంలో ఉజ్వల అనే సంస్థ డిపాజిట్లు సేకరించి బోర్డు తిప్పేసింది. ఈ ఏడాదిలో ఫస్ట్ ఫినాన్స్ సంస్థ మంచిర్యాల బ్రాంచి నెలకొల్పగా అనేకమంది ఖాతాదారులు నష్టపోయారు. తాజాగా జిల్లా కేంద్రంలో గత ఏడాది వరకు కార్యకలాపాలు నిర్వహించిన ఫినోసిటీ నిధి లిమిటెడ్ సంస్థ రూ.లక్షలు డిపాజిట్లు సేకరించి కార్యాలయం మూసేసింది. దీంతో ఉద్యోగులు, సంస్థలో డిపాజిట్లు చేసిన వారంతా ఆందోళన చెందుతున్నారు. గతంలో ఓ సహకార బ్యాంకులో పని చేసిన వ్యక్తులే ఈ సంస్థను నెలకొల్పి చేతులెత్తేశారు. ఆ నిర్వాహకులపై పోలీసుస్టేషన్‌లో కేసు సైతం నమోదు చేశారు. రాజకీయ పలుకుబడితో డబ్బులు తిరిగి ఇవ్వకుండా తప్పించుకుంటున్నారని బాధితులు వాపోతున్నారు. ఈ ఆర్థిక సంస్థ నిర్వాహకంపై ప్రజాప్రతినిధులు, అధికారులను కలుస్తున్నారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో డబ్బులు కట్టిన వారంతా ఆందోళన చెందుతున్నారు.

పుట్టగొడుగుల్లా సంస్థలు..

జిల్లాలో నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సేవల పేరుతో పుట్టగొడుగుల్లా అనేక సంస్థలు వెలుస్తున్నాయి. కనీసం రూ.5లక్షల పెట్టుబడి(క్యాపిటల్)తో నిర్వహించుకునే అవకాశం ఉండడంతో ఎవరైనా ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. సింగరేణి ఉద్యోగులు, కార్మికులతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు, ఉద్యోగ, వ్యాపారులే లక్ష్యంగా ఈ సంస్థలను ఏర్పాటు చేస్తూ రూ.లక్షలు సేకరిస్తున్నారు. బ్యాంకింగ్ తరహాలోనే ఫిక్స్‌డ్ డిపాజిట్లు, సేవింగ్స్, రుణాలు, నెలసరి డిపాజిట్లు(ఆర్‌డీ) వంటి కార్యకలాపాలు చేపట్టాలి. కొన్ని సంస్థలు విజయవంతంగా కొనసాగుతుండగా చాలా వరకు మూతపడ్డాయి. కానీ కొందరు నిర్వాహకులు సామాన్యుల నుంచి డబ్బులు సేకరించి తమ సొంత అవసరాలు, రియల్ వ్యాపారాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. నష్టాలు వస్తే, డిపాజిటర్లపై ప్రభావం పడుతోంది. దీంతో ఆ సంస్థలు ఎత్తేసినా వాటికి సంబంధించిన పై అధికారులు స్థానికంగా ఎవరూ లేక వారిపై చర్యలు తీసుకోవడం సైతం కష్టంగా మారుతోంది. ఆర్థిక మోసాలపై ఆర్‌బీఐకి ఫిర్యాదు చేయాలి. ఆ స్థాయిలో పోరాటం చేయలేక పెట్టిన డబ్బులు తిరిగి పొందలేక అష్టకష్టాలు పడుతున్నారు. జిల్లాలో కరోనా సమయంలో అనేక చిట్ ఫండ్స్ కంపెనీలు సైతం ఖాతాదారుల తమ చిట్ డబ్బులు చెల్లించలేక మూతపడ్డాయి. ఆ సంస్థలపైనా కొందరు కోర్టుల్లో కేసులు సైతం వేశారు.

తస్మాత్ జాగ్రత్త..

డబ్బులు డిపాజిట్లు చేసే ముందు జాగ్రత్త వహించాలని బ్యాంకింగ్ రంగ ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు. తక్కువ పెట్టుబడి ఎక్కువ లాభం, తక్షణ రుణ సదుపాయం, తక్కువ వడ్డీ రేట్లతో రుణాలు అంటూ ఆశకు పోతే మోసపోతారని హెచ్చరిస్తున్నారు. ఏదైనా ఆర్థిక లావాదేవీలు చేసే ముందు సంస్థల నిర్వాహకుల చరిత్ర, ఆర్థిక స్థితి, తదితరవన్నీ తెలుసుకునే ముందుకు వెళ్లాలని సూచిస్తున్నారు. డబ్బులు పెట్టి మోసపోతే మళ్లీ రికవరీ చేయడం కష్టమని చెబుతున్నారు.

మాకు న్యాయం చేయాలి



సంస్థలో ఉద్యోగం ఇస్తున్నామని చెప్పి మా నుంచి డబ్బులు వసూలు చేశారు. డిపాజిటర్ల నుంచి రూ. 20లక్షల దాకా అప్పగించాం. మాకు జీతం ఇవ్వకపోగా, డిపాజిటర్ల డబ్బులు తిరిగి ఇవ్వడం లేదు. సంస్థ నుంచి మోసపోయిన వారికి న్యాయం చేయాలి.

– నాగ మల్లేశ్, రఘు, కరీం, పాషా

ఎమ్మెల్యే వినోద్‌కు భద్రత పెంపు

- 'మావో'ల హెచ్చరికతో పోలీసులు అప్రమత్తం
- క్యాంపు కార్యాలయం వద్ద మెటల్ డిటెక్టర్ ఏర్పాటు



క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మెటల్ డిటెక్టర్

బెల్లంపల్లి: అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌కు పోలీసు భద్రతను మరింత పెంచారు. వారం రోజుల క్రితం మావో యిస్టులు హెచ్చరిస్తూ లేఖ విడుదల చేయడంతో ముందస్తు జాగ్రత్తగా భద్రతను కట్టుదిట్టం చేశారు. హైదరాబాద్ నుంచి బెల్లంపల్లికి వచ్చే ఎమ్మెల్యేకు అంగరక్షకులతో ఇప్పటివరకు భద్రత కల్పించగా.. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో భద్రతను పెంచి రక్షణ చర్యలు చేపట్టారు. ప్రత్యేకంగా రోప్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో ఏ ప్రాంతానికి వెళ్లినా ఇకపై రోప్ పార్టీ అనుసరిస్తుంది. గురువారం తాండూర్, కాసిపేట మండలాల్లో ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరు కాగా రోప్ పార్టీ భద్రత చర్యలు చేపట్టింది. బెల్లంపల్లి ఏఎంసీ ఏరియాలోని క్యాంపు కార్యాలయం వద్ద బాంబుస్క్వాడ్, మెటల్ డిటెక్టర్ ఏర్పాటు చేశారు. సందర్శకులను ముఖద్వారం వద్ద మెటల్ డిటెక్టర్‌తో పరీక్షించిన తర్వాతే లోపలికి పంపిస్తారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీ వంశీక్రిష్ణ, పక్కన కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యేలు వినోద్, వెడ్మ బొజ్జు

- వచ్చే సమావేశానికి పూర్తి నివేదికలతో రావాలి
- అధికారులు రాకుంటే చర్యలు తప్పవు
- పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీక్రిష్ణ
- కలెక్టరేట్‌లో దిశ సమావేశం



పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మంచిర్యాలఅగ్రికల్చర్: కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులు సత్వరమే పూర్తి చేసి నివేదికలతో వచ్చే సమావేశానికి హాజరు కావాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీక్రిష్ణ అన్నారు. గురువారం దిశ(జిల్లా గ్రామీణాభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ) సమావేశం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. కమిటీ చైర్‌పర్సన్‌గా ఎంపీ వంశీక్రిష్ణ జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, బెల్లంపల్లి, ఖానాపూర్ ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, వెడ్మ బొజ్జు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్‌లతో కలిసి అధికారులతో సమీక్షించారు. ఎంపీ వంశీక్రిష్ణ మాట్లాడుతూ జిల్లాలో రైల్వేలైన్ల పునరుద్ధరణ, అండర్ బ్రిడ్జి పనులతో హాల్టింగ్ ఉన్న పలు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లు రద్దు చేస్తున్నారని, గేట్ల మూసివేతతో ప్రజలు ఇబ్బంది పడాల్సి వస్తుందని, సత్వరమే పనులు పూర్తి చేయాలని చెప్పారు. జిల్లా నుంచి వరంగల్ ఎన్‌హెచ్-163 భూ సేకరణ, పనులు ప్రారంభించాలని సూచించారు. మంచిర్యాల నుంచి క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు విస్తరణ పనులు నెమ్మదిగా సాగుతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బెల్లంపల్లి, నెన్నెల కేజీబీవీల్లో గదులు, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. చెన్నూర్‌లో 100 పడకల ఆస్పత్రి సత్వరమే పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని సూచించారు. బెల్లంపల్లి నుంచి సిజేరియన్ల కోసం నెలకు 25 నుంచి 30 కేసులు మంచిర్యాలకు తరలిస్తున్నారని, అక్కడి ఆస్పత్రిలో సిజేరియన్లు చేయడానికి వచ్చిన ఇబ్బంది ఏమిటని ప్రశ్నించారు. బ్లడ్‌బ్యాంకు లేకపోవడం, కొన్ని గ్రూపులు మాత్రమే లభిస్తుండడం వల్లనే రెఫర్ చేయాల్సి వస్తుందని జిల్లా ఆరోగ్య, వైద్యాధికారి తెలిపారు. జిల్లా కేంద్రంలో విద్యుత్ సమస్య, పాఠశాలల సమస్యలపై చర్చించారు. ఈ సమావేశంలో జెడ్పీసీఈవో గణపతి, దిశ కమిటీ సభ్యులు, మంచిర్యాల, నస్పూర్, బెల్లంపల్లి, చెన్నూర్, మందమర్రి, క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్లు, కమిషనర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నివేదికలతో రావాలి

కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరు అవుతున్న నిధులతో అభివృద్ధి పనులు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలి. ఏదైనా సమస్య ఉంటే నా దృష్టికి కానీ ఎంపీ దృష్టికి వస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. వచ్చే సమావేశానికి పనుల్లో పురోగతి చూపించాలి. సంబంధిత అధికారులు నివేదికలతో హాజరు కాకుంటే చర్యలు తప్పవు. అత్యవసరమైతే ఎంపీకి సమాచారం ఇచ్చి వెళ్లాలి.

– జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

18న బెల్లంపల్లిలో ప్రజాదర్బార్

బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి బస్సు సౌకర్యం లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతూ ఆటోలో వెళ్లాల్సి వస్తుంది. ప్రజల సౌకర్యార్థం ఆర్టీసీ అధికారులు బస్సు ప్రారంభించాలి. ఏదైనా సమస్య ఉంటే బస్సు కోసం మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మాట్లాడుతాను. దివ్యాంగులకు సదరం క్యాంపులు నిర్వహించి అర్హులకు సర్టిఫికెట్లు అందించాలి. ఈ నెల 18న బెల్లంపల్లి నియోజకవర్గంలో నిర్వహించనున్న ప్రజాదర్బార్‌కు జిల్లా కలెక్టర్‌తోపాటు అన్ని శాఖల అధికారులు హాజరై ఫిర్యాదులు స్వీకరించాలి.

– బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

పర్యవేక్షణ లేకనే విద్యార్థుల అస్వస్థత

ఖానాపూర్ నియోజకవర్గంలో పాఠశాలలు, సంక్షేమ వసతిగృహాల నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ లేక విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారు. ఎలాంటి భోజనం పెడుతున్నారనేది పర్యవేక్షించడం లేదు. ఇటీవల మంచిర్యాల జిల్లాలో విద్యార్థులు ఫుడ్‌పాయిజన్‌కు గురైతే సంబంధిత అధికారులను సస్పెండ్ చేశారు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలో ఫుడ్‌పాయిజన్ వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురై రోజులు గడుస్తున్నా అధికారులపై ఎలాంటి చర్యలు లేవు. ప్రతీ పాఠశాలను ఎంఈవో క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్లక్ష్యం వహిస్తున్న ఉపాధ్యాయులు, వార్డెన్లపై చర్యలు తీసుకోవాలి.

– ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

విధులకు డుమ్మా..!



ఆర్కే 6 గనిపై గైర్హాజరు కార్మికులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఏరియా అధికారులు

- 30శాతం మంది ఎగనామం
- బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం
- యువ కార్మికులే అధికం
- అధికారుల కౌన్సెలింగ్

శ్రీరాంపూర్‌లో మొత్తం కార్మికులు : 8582
ఈ ఏడాదిలో 75 మస్టర్ల కంటే తక్కువ చేసిన వారు : 597

గని పేరు	అక్టోబర్ నెల గైర్హాజరు (శాతాల్లో)
ఆర్కే5	33
ఆర్కే6	29
ఆర్కే7	32
ఆర్కే న్యూటెక్	29
ఎస్సార్పీ 1	29
ఎస్సార్పీ 3, 3ఏ	30
ఐకే 1ఏ	35

శ్రీరాంపూర్: సింగరేణిలో యువ కార్మికులు విధులకు డుమ్మా కొడుతున్నారు. గతంతో పోల్చితే పెరిగిన టెక్నాలజీ, పనులు సులభతరంగా మారిన ఈ కాలంలోనూ గైర్హాజరవుతున్నారు. భూగర్భ గనుల్లో గైర్హాజరు ఎక్కువగా ఉంటోంది. కంపెనీలోనే అత్యధిక భూగర్భ గనులు ఉన్న శ్రీరాంపూర్‌లో గత కొంతకాలంగా పెరుగుతున్న గైర్హాజరుతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. ప్రతీరోజు 30శాతం మంది కార్మికులు విధులకు హాజరు కావడం లేదు. మొదట్లో తక్కువగా ఉన్నా రోజు రోజుకు గైర్హాజరు శాతం పెరగడం కలవర పెడుతోంది. దీని ప్రభావం బొగ్గు ఉత్పత్తి, వార్షిక ఉత్పత్తి లక్ష్య సాధనపై పడుతోంది. గతంలో శ్రీరాంపూర్‌లోని భూగర్భ గనుల్లో వంద శాతం బొత్తు ఉత్పత్తి జరుగగా.. గత పది నెలల నుంచి 90శాతానికి మించడం లేదు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి అక్టోబర్ 31వరకు శ్రీరాంపూర్‌లోని భూగర్భ గనుల్లో 87శాతమే బొగ్గు ఉత్పత్తి జరిగింది. అక్టోబర్‌లో ఐకే 1ఏ గనిలో 35 శాతం మంది కార్మికులకు విధులకు రాలేదంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థమవుతోంది. దీంతో పని స్థలాల వద్ద ఆశించిన స్థాయిలో ఉత్పత్తి రావడం లేదు. గైర్హాజరు వల్ల వేతన నష్టమే కాకుండా ఉత్పత్తికి నష్టం వాటిల్లుతోందని, కంపెనీ భవిష్యత్‌కు ప్రమాదకరమని అధికారులు పేర్కొంటున్నారు.

వంద మస్టర్ల నిబంధన

సింగరేణిలో ప్రతీ కార్మికుడు ఏడాదికి వంద మస్టర్లు పూర్తి చేయాలి. అంతకంటే తక్కువ మస్టర్లు చేస్తే అధికారులు సదరు కార్మికులకు మేనేజర్, జీఎం స్థాయిలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అనారోగ్య, ఇతర వృత్తిపరమైన కారణాలు ఉంటే నివృత్తి చేసేందుకు కృషి చేస్తారు. సరైన కారణాలు లేక, వ్యక్తిగత సమస్యలు, ఉద్యోగంపై నిర్లక్ష్యం చేస్తూ విధులకు డుమ్మా కొడుతూ, ఎన్నిసార్లు చెప్పినా మార్పు రాకపోతే మూడేళ్లు చూసి డిస్మిస్ చేస్తారు. ఇటీవల చాలామంది ఈ కారణాలతో డిస్మిస్ అయ్యారు.

ఇష్టం లేక ఉద్యోగంలో చేరి..

కారుణ్య ఉద్యోగాలతో సింగరేణిలో యువ కార్మికులు గత నాలుగేళ్లలో అధికంగా చేరారు. కంపెనీ వ్యాప్తంగా 11,832 మంది చేరగా అందులో ఒక్క శ్రీరాంపూర్ ఏరియాలోనే 3,498 మంది ఉన్నారు. ఇలా చేరిన వారే ఎక్కువగా డుమ్మా కొడుతున్నారు. బీటెక్, ఎంటెక్ చదువుతూ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసే పిల్లలను కొందరు తల్లిదండ్రులు బలవంతంగా కారుణ్య ఉద్యోగంలో చేర్పిస్తున్నారు. ప్రభుత్వ సంస్థ కావడంతో ఎంతో భద్రత ఉంటుందని నచ్చజెప్పుతున్నారు. కొద్ది రోజులు విధులు నిర్వర్తించిన తర్వాత ఆ పని విధానం నచ్చక, లోపలికి దిగి పని చేయడం కష్టంగా అనిపించడంతో రావడం లేదు. కౌన్సెలింగ్ సందర్భంగా కొందరు ఇవే కారణాలు పేర్కొంటున్నారు. కొందరు యువ ఉద్యోగులు మద్యం, ఇతర వ్యసనాలు, స్నేహితులతో జులాయిగా తిరుగుతూ చిన్న చిన్న కారణాలతో విధులకు ఎగనామం పెడుతున్నారు. ఉద్యోగాన్ని యువ కార్మికులు ఖాతారు చేయడం లేదని, ఎలాంటి ప్రయాస లేకుండా ఉద్యోగం రావడం వల్ల విలువ తెలియడం లేదని సీనియర్ కార్మికులు పేర్కొంటున్నారు. కొందరు ప్రైవేటు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల్లో రూ.లక్షల్లో వేతనాలు పొందిన వారు సింగరేణిలో చేరిన తర్వాత ఈ వేతనాలు సరిపోవడం లేదని పేర్కొంటున్నారు. దీంతో అయిష్టంగా ఉద్యోగాలకు వస్తున్నారు.

కౌన్సెలింగ్ ముమ్మరం..

గైర్హాజరు కార్మికుల్లో మార్పు తీసుకురావాలనే సంకల్పంతో అధికారులు ముమ్మరంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. గనుల వారీగా ఈ ఏడాది అక్టోబర్ నాటికి 75 కంటే తక్కువ మస్టర్లు ఉన్న వారిని కుటుంబ సభ్యులతో సహా పిలిచి విధులకు ఎందుకు రావడం లేదో తెలుసుకుంటున్నారు. కంపెనీ పరంగా ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరిస్తున్నారు. నిర్లక్ష్యంగా రావడం లేదని తెలిస్తే ఉద్యోగం గొప్పతనం తెలియ చేయడంతోపాటు నిబంధన ప్రకారం 100 మస్టర్లు లేకుంటే ఉద్యోగం పోతుందని హెచ్చరిస్తూ మారాలని సూచిస్తున్నారు.

డ్యూటీలు సక్రమంగా చేయాలి

సింగరేణిలో ఉద్యోగం చేయడం అదృష్టంగా భావించాలి. చిన్న చిన్న కారణాలతో గైర్హాజరు కావద్దు. గైర్హాజరు వల్ల ఉద్యోగి కుటుంబానికే కాకుండా కంపెనీ ఉత్పత్తి, ఉత్పాదకతకు కూడా నష్టం వాటిల్లుతుంది. ఇకనైనా గైర్హాజరు లిస్టులో ఉన్న కార్మికుల్లో మార్పు రావాలి. డ్యూటీ బాట పట్టాలి.

– అరవిందరావు, డీజీఎం(పర్సనల్), శ్రీరాంపూర్

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్

లక్సెట్టిపేట: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి మహ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు చట్టాలు, విద్యాహక్కులు, వాటి ఉపయోగాలపై తెలుసుకోవాలని అన్నారు. విద్యాహక్కు ప్రతీ విద్యార్థికి ఉంటుందని, అందరూ అవగాహన చేసుకోవాలని అన్నారు. చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఏజీపీ వేల్పుల సత్యం, ప్రధానోపాధ్యాయురాలు సునంద, న్యాయవాదులు సత్తన్న, శివశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వసతిగృహం తనిఖీ

మంచిర్యాలఅర్బన్: స్థానిక ఎస్సీ కళాశాలల బాలుర వసతిగృహాన్ని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి(డీడీ) రవీందర్‌రెడ్డి గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొత్త మెనూ అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనం, వసతిగృహంలో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కిచెన్, స్టోర్ రూంను పరిశీలించారు. చికెన్‌తో వండిన భోజనాన్ని పరిశీలించి వడ్డించారు. కళాశాల వసతిగృహ సంక్షేమాధికారి సీహెచ్.కుమారస్వామి పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

మంచిర్యాలఅర్బన్: ఎస్సీ వసతిగృహాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కార్యాలయంలో ఎస్సీ వసతిగృహాల వార్డెన్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంటి నుంచి తెచ్చుకున్న ఆహార పదార్థాలు నాణ్యమైనవో కాదో..? పరిశీలించాలని సూచించారు.

స్కిల్ యూనివర్సిటీని సద్వినియోగం చేసుకోవాలి

బెల్లంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్కిల్ యూనివర్సిటీని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని డీఐఈవో కే.అంజయ్య అన్నారు. గురువారం బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఆనంద జాబ్ ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించి విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఏ.అంజయ్య, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

'అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం..'

- ఆత్మహత్యాయత్నం చేసిన కుటుంబానికి ఎస్పీ భరోసా



బాధితురాలిని పరామర్శిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

భైంసాటౌన్: నిజామాబాద్ జిల్లా న్యాల్‌కల్‌కు చెందిన అనురాధ భర్త వేణు, కూతురు పూర్ణిమతో కలిసి బాసర గోదావరిలో దూకి ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ ఘటనలో భర్త మృతి చెందాడు. కూతురు గల్లంతు కాగా, అనురాధ పట్టణంలోని ప్రభుత్వ ఏరియాస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ మేను ఎస్పీ జానకీ షర్మిల గురువారం పరామర్శించారు. ఆత్మహత్యాయత్నానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. అప్పు కట్టాలని వేధించిన వడ్డీ వ్యాపారుల కోసం పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని, ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు.

గల్లంతైన యువతి మృతదేహం లభ్యం



పూర్ణిమ(ఫైల్)

బాసర: అప్పుల బాధ, వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఓ కుటుంబం బుధవారం బాసర గోదావరి నదిలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వి షయం తెలిసిందే. వివరాలు ఇలా ఉన్నాయి.. నిజామాబాద్‌లోని న్యాల్‌కల్‌కు చెందిన వేణు మృతిచెందగా, భార్య అనురాధ ప్రాణాలతో బయటపడింది. కుమార్తె పూర్ణిమ గల్లంతైంది. గురువారం ఉద యం పోలీసులు గజఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం మృతదేహం లభ్యమైంది. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. అనంతరం తల్లికి అప్పగించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గణేశ్ తెలిపారు.

ప్రేరేపించడంతోనే రైతు ఆత్మహత్యాయత్నం

- బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగారెడ్డి



మాట్లాడుతున్న గంగారెడ్డి

బోథ్: బోథ్ మండలంలోని కుచులాపూర్ గ్రామానికి చెందిన సోయా రైతు మోహన్‌రెడ్డిని ఈ నెల 6న కొంతమంది కావాలనే ఆత్మహత్యాయత్నానికి ప్రేరేపించారని బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి ఆరోపించారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పురుగుల మందు డబ్బాతో ఉద్దేశపూర్వకంగా ఆందోళన నిర్వహించారని, విషయాన్ని సదరు రైతే తనకు చెప్పాడన్నారు. ఒకవేళ పురుగుల మందు తాగితే రైతు పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని బదనాం చేయడానికే ఇలాంటి కుట్రలు పన్నుతున్నారన్నారు. మార్కెట్‌కు వచ్చిన ప్రతీగింజను కొంటామన్నారు. మార్కెట్‌లో లోడింగ్ సమస్య, సంచుల కుట్టుమిషన్ పనిచేయకపోవడంతోనే సోయా కొనుగోళ్లలో కొంత జాప్యం ఏర్పడిందన్నారు. హమాలీల సంఖ్యను పెంచి, భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు రాకుండా చూస్తామని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు.

'తెర'మరుగు

- నిర్మల్ జిల్లాలో పలు థియేటర్లు మూసివేత
- జనం లేక నిర్వహణ భారంతో..
- వాటిని కూల్చేసి ఫంక్షన్ హాళ్లు, షాపింగ్ మాళ్లు ఏర్పాటు
- ఇంట్లోనే మినీ థియేటర్, ఎల్ఈడీ తెరలు



ఫంక్షన్‌హాల్‌గా మారిన నటరాజ్ థియేటర్(ఫైల్)



జిల్లాకేంద్రంలోని ఓ థియేటర్

నిర్మల్‌ఖిల్లా: ఒకప్పుడు సినిమా విడుదల ఉందంటే థియేటర్ల వద్ద పండుగ వాతావరణం ఉండేది. దసరా, దీపావళి, సంక్రాంతి పండుగల వేళ కొత్త సినిమాలతో కోలాహలం అంతా ఇంతా కాదు. గ్రామీణ, పట్టణాల నుంచి కుటుంబాలతో తరలివచ్చి సినిమాలు చూసేవారు. ప్రస్తుతం పెద్దహీరోల సినిమాలకు తప్ప జనం థియేటర్లకు రావడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో వాటిని కూల్చేసి ఫంక్షన్ హాళ్లు, షాపింగ్ మాల్స్‌గా ఏర్పాటు చేస్తున్నారు. వాణిజ్య స్థలాలకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో బహుళ వ్యాపార సముదాయాలుగా పునర్నిర్మిస్తున్నారు.

షాపింగ్ మాల్స్, ఫంక్షన్ హాళ్లుగా..

జిల్లాకేంద్రంతోపాటు భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీ కేంద్రాలు ఉన్నాయి. నిర్మల్‌లో గతంలో ఐదు సినిమా థియేటర్లు ఉండేవి. ప్రస్తుతం రెండు నిర్వహణలో ఉండగా మిగతావి షాపింగ్ మాల్స్, ఫంక్షన్ హాళ్లుగా రూపాంతరం చెందాయి. నిర్మల్‌లో కమల్ థియేటర్ ఇప్పటికే నివాస సముదాయంగా, గతంలో ఉన్న అశోక థియేటర్ ప్రస్తుతం షాపింగ్ మెగామార్ట్‌గా మారింది. ఒకప్పుడు ప్రేక్షకులతో కిక్కిరిసిపోయే వెంకటేశ థియేటర్ రెండేళ్లక్రితం కూల్చేశారు. నూతనంగా బహుళ వ్యాపార సముదాయం నిర్మించనున్నారు. శివాజీచౌక్ సమీపంలో నటరాజ్ థియేటర్ కన్వెన్షన్ హాల్‌గా మారిపోయింది. జిల్లా కేంద్రంలో నారాయణ, తిరుమల థియేటర్లు అందుబాటులో ఉన్నాయి.

నిర్వహణ భారంతో..

గతంలో ప్రేక్షకులతో కిక్కిరిసిన ఖానాపూర్‌లోని ఏకైక థియేటర్ లక్ష్మీ టాకీస్. జనం లేక వెలవెలబోతున్న నేపథ్యంలో నిర్వహణ భారంగా మారడంతో కూల్చివేశారు. దాని స్థానంలో వాణిజ్య సముదాయాలు నిర్మించే పనిలో ఉన్నారు. భైంసాలోని కమల థియేటర్ ప్రస్తుతం మనుగడలో ఉన్నా పెద్దగా గిట్టుబాటు లేకుండా ఉందని యజమానులు చెబుతున్నారు. ప్రత్యామ్నాయంగా వాణిజ్య సముదాయాలు, షాపింగ్ మాల్స్ ఏర్పాటు చేస్తున్నారు.

ఇంట్లోనే తెరలు ఏర్పాటు

ప్రస్తుతం ఓటీటీల కాలం వచ్చేసింది. కుటుంబ సమేతంగా ఇంట్లోనే భారీ ఎల్ఈడీ తెరలు ఏర్పాటు చేసి కొత్త సినిమాలు వీక్షిస్తున్నారు. ఉన్నతవర్గాల వారు ఇంట్లోనే మినీ థియేటర్ ఏర్పాటు చేసుకుంటున్నారు. నిర్మల్‌లో దాదాపు ఇలాంటి తెరలను నిర్మించుకున్న వారు వందల సంఖ్యలో ఉన్నట్లు టెక్నీషియన్లు చెబుతున్నారు.

ఆసక్తి చూపడం లేదు



సినిమా వీక్షించడానికి గతంలో కుటుంబంతో కలిసి వెళ్లేవారు. చిన్నప్పుడు ఎడ్లబండిపై వెళ్లేవాడిని. ప్రస్తుతం ఓటీటీల్లో కొత్త సినిమాలు వచ్చేస్తున్నాయి. మారుతున్న కాలానికి అనుగుణంగా థియేటర్లకు రావడానికి జనం ఆసక్తి చూపడం లేదు. మునుపటిలా అవి మనుగడ సాగించలేకపోతున్నాయి.

– టి.సంపత్ కుమార్, సీనియర్ సిటిజన్, నిర్మల్

ప్రేక్షకుల సంఖ్య తగ్గింది



గతంలో కంటే ఇప్పుడు థియేటర్‌కు వచ్చి సినిమాలు చూసే ప్రేక్షకుల సంఖ్య తగ్గింది. పెద్ద హీరోల సినిమాలకు ఇప్పటికి హంగామా ఉంటుంది. విడుదలైన రోజు నుంచి వారంలో సినిమా చూసే అభిమానులు ఉన్నారు.

– వసంత్ రాథోడ్, సినీ అభిమాని, నిర్మల్

'డిస్ట్రిబ్యూషన్' తరలింపు!

- మంచిర్యాల నుంచి కాజీపేటకు..
- షిఫ్ట్ చేసేలా తపాలాశాఖ యోచన
- సత్వర సేవలకు అంతరాయం
- ఇక్కడే కొనసాగించాలని ప్రజల అభ్యర్థన



జిల్లాకేంద్రంలోని సార్టింగ్ కార్యాలయం (రైల్వేమెయిల్ సర్వీస్)

పాతమంచిర్యాల: జిల్లాకేంద్రంలోని రైల్వేమెయిల్ సర్వీస్, సార్టింగ్ (డిస్ట్రిబ్యూషన్) కార్యాలయాన్ని కాజీపేటకు తరలించేందుకు తపాలాశాఖ యోచిస్తోంది. అక్కడి స్పీడ్‌పోస్టు కార్యాలయంలో విలీనానికి కసరత్తు చేస్తోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏకైక సార్టింగ్ కార్యాలయం మంచిర్యాలలో ఉంది. జిల్లాలకు చెందిన పార్సిళ్లు, ఉత్తరాలను ఇతర ప్రాంతాలకు చేరవేయడానికి రైలుమార్గం ఉన్న మంచిర్యాలలో 1986లో దీన్ని ఏర్పాటు చేశారు. 2016 వరకు సేవలు సజావుగా కొనసాగాయి. ఇక్కడ ఉన్న స్పీడ్‌పోస్టు కార్యాలయాన్ని 2016లో వరంగల్‌కు తరలించారు. దీంతో స్పీడ్‌పోస్టు ఉత్తరాల బట్వాడా వరంగల్ నుంచి కొనసాగుతోంది. దీంతో ఒక్కరోజు అందే ఉత్తరం మూడురోజులు ఆలస్యంగా అందుతున్నాయి. పోస్టల్ బ్యాలెట్లు సైతం ఆలస్యంగా అందిన ఘటనలున్నాయి.

విలీనానికి మొగ్గు..

ఉద్యోగులను కుదించాలని, ఖర్చులు తక్కువ చేసుకోవాలనే ఉద్దేశంతో తపాలాశాఖ ఈ విలీనానికి మొగ్గుచూపుతోంది. దీంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. విలీన ప్రక్రియ వద్దని హైదరాబాద్‌లోని చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయ సూపరింటెండెంట్‌కు నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయీస్ సంఘం నాయకులు వినతిపత్రాలు అందజేశారు. జిల్లాల్లో ఇప్పటివరకు ఉత్తరాలు, పార్సిళ్ల కొరియర్ సేవలను తపాలా ద్వారా పంపిస్తున్నారు. ఈ తరహా సేవలు లేకపోతే ప్రజలు ప్రైవేట్ కొరియర్ సర్వీస్‌ల వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆర్ఎంఎస్, సార్టింగ్ కార్యాలయాన్ని ఇక్కడే కొనసాగేలా ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



మంచిర్యాల నుంచి రైల్వేమెయిల్ సర్వీస్, సార్టింగ్ కార్యాలయం తరలిపోకుండా తపాలా శాఖ అధికారులతో మాట్లాడతాను. ప్రజలకు సేవలందించే కార్యాలయాలు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లకుండా చర్యలు తీసుకుంటాం.

– గడ్డం వంశీకృష్ణ, పెద్దపల్లి ఎంపీ

వరకట్న వేధింపులకు వివాహిత బలి

- పురుగుల మందు తాగి భర్త ఆత్మహత్యాయత్నం
- న్యూలింగంపల్లిలో ఘటన



వివరాలు తెలుసుకుంటున్న డీఎస్పీ గంగారెడ్డి

మామడ: వరకట్న వేధింపులకు వివాహిత బలైంది. భర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మండలంలోని న్యూలింగంపల్లిలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని న్యూలింగంపల్లికి చెందిన దేవరశెట్టి నవీన్‌కు నిజామాబాద్ జిల్లా బాద్గుణకు చెందిన వికాసిని(24)తో 2019లో వివాహమైంది. రూ.3 లక్షల నగదు, రెండు తులాల బంగారం కట్నకానుకలు అందించారు. ఈ దంపతులకు 5, 3 ఏళ్లలోపు ఇద్దరు కుమార్తెలు, 6 నెలల కుమారుడు ఉన్నారు. నవీన్ వడ్రంగి పనిచేసి కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రూ.50 వేలు అదనపు కట్నం తేవాలని కొంతకాలంగా భార్యను వేధించసాగాడు. ఈ విషయమై తరచూ గొడవలు జరుగుతుండేవి. ఇరుపెద్దలు నవీన్‌కు నచ్చజెప్పారు. కొన్నిరోజులుగా వీరి కాపురం సజావుగా సాగింది. కొంతకాలం తర్వాత కట్నం తేవాలని భార్యను శారీరకంగా మానసికంగా ఇబ్బందులకు గురిచేసేవాడు. ఈ క్రమంలో బుధవారం రాత్రి భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. గురువారం ఉదయం నవీన్ పనికి వెళ్లగా కుమార్తె పాఠశాలకు వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో వికాసిని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పిల్లల ఏడుపులు విని కాలనీవాసులు అక్కడికి వెళ్లగా వికాసిని ఉరేసుకుని కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ గంగారెడ్డి, సీఐ నవీన్‌కుమార్, ఎస్సై సందీప్ పరిశీలించారు. మృతురాలి కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కాగా, భార్య ఉరేసుకున్న విషయం తెలియడంతో భర్త గ్రామంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతన్ని అంబులెన్స్‌లో నిర్మల్ ఆసుపత్రికి తరలించారు.



వికాసిని (ఫైల్)

బర్రెల మందపై చిరుతపులి దాడి



ముల్కల్ల ర్యాలీవాగు సమీపంలో పెద్దపులి అడుగులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం ముల్కల్ల శివారులోని ర్యాలీవాగు ప్రాజెక్ట్ పరిసరాల్లోని అటవీ ప్రాంతంలో మేతకు వెళ్లిన బర్రెల మందపై బుధవారం సాయంత్రం చిరుతపులి దాడి చేసింది. రాదండ్ల ఓదమ్మకు చెందిన ఓ బర్రె గాయపడింది. అటవీ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పాదముద్రల ఆధారంగా చిరుతపులి దాడిగా పేర్కొంటున్నారు. కాగా, పులి దాడి చేసినట్లుగా పశు యజమానులు చెబుతున్నారు.

బ్యాటరీ షాపులో చోరీ

మంచిర్యాలక్రైం: మున్సిపల్ కార్యాలయ సమీపంలోని ఎక్సైడ్ బ్యాటరీ షోరూమ్‌లో చోరీ జరిగింది. సీఐ ప్రమోద్‌రావు కథనం ప్రకారం..యజమాని తుషార్ ఆగర్వాల్ బుధవారం సాయంత్రం షోరూమ్ షెటర్‌కు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం వచ్చి చూసేసరికి తాళం పగుల గొట్టి ఉంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. అక్కడికి ఫింగర్ ప్రింట్ నిపుణులతో చేరుకుని వేలిముద్రలు సేకరించారు. రూ.3.80 లక్షల నగదును దొంగలు ఎత్తుకెళ్లారని బాధితుడు ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

ఆసిఫాబాద్‌అర్బన్: అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాజేశ్వర్ కథనం ప్రకారం..జిల్లాకేంద్రంలోని పొట్టిశ్రీరాములు చౌక్ ప్రాంతంలో జంజిరాల భిక్షపతి కుమారుడు రాజశేఖర్(22) నివాసం ఉంటున్నాడు. ఏడాదిగా పనిలేక ఖాళీగా ఉన్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆస్పత్రులకు వెళ్లిన కోలుకోలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెంది గురువారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ముగిసిన సున్నపురాయి గనుల భద్రత వారోత్సవాలు

కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో 39వ సున్నపురాయి గనుల భద్రత వారోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా భద్రత, ఉత్పత్తి రంగంలో వివిధ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో దేవాపూర్ సున్నపురాయి గనికి (ద్వితీయ), డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ సేఫ్టీ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో (ప్రథమ), సేఫ్‌మైన్ వర్కింగ్, లోడింగ్ ట్రాన్స్‌పోర్టేషన్, ఎలక్ట్రికల్ విభాగాల్లో ద్వితీయ బహుమతులు సాధించాయి. సంస్థ యూనిట్ హెడ్ బాల గిరిధర్ , జనరల్ మేనేజర్ మైన్స్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ రాజశేఖర్‌రెడ్డి, సహారే గని అధికారులకు డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ సేఫ్టీ నాగేశ్వర్‌రావు బహుమతులు అందజేశారు.

సింగరేణి పైపులైన్ పనుల అడ్డగింత

- భూములకు పరిహారం ఇవ్వాలని గిరిజనుల డిమాండ్



పనులు అడ్డుకుంటున్న గిరిజనులు

కాసిపేట: మందమర్రి ఏరియా కల్యాణిఖని ఓసీ సమీపంలో సింగరేణి పైపులైన్ పనులను గిరిజనులు అడ్డుకున్నారు. పరిహారం ఇవ్వకుండా తమ భూముల్లో పనులు ఎలా చేపడుతారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా బానోత్ ఈశ్వరి, కున్సోత్ మోతి, ఆజ్మీర జమున మాట్లాడారు. బెల్లంపల్లి మండలం 2పైకి సర్వేనంబర్‌లో 9 ఎకరాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే 34 ఎకరాలకు సంబంధించి అధికారులు పరిహారం చెల్లించి తమకు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి ఎస్టేట్ అధికారులు అక్కడికి చేరుకుని వారితో మాట్లాడిన శాంతించలేదు. కాసిపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్, బెల్లంపల్లి రెవెన్యూ అధికారులను పిలిపించారు. వారు బాధితులతో మాట్లాడి శుక్రవారం బెల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయానికి పత్రాలు తీసుకురావాలని సూచించారు.

రోడ్లపై ధాన్యం పోసిన రైతుపై కేసు

లోకేశ్వరం: మండలంలోని సేవాలాల్‌తండాకు చెందిన పవార్ టాకారాం అనే రైతు సేవాలాల్‌తండా- భైంసా రోడ్డుపై వరిధాన్యం ఆరబోశాడు. రాళ్లు పెట్టడంతో వారిపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. లోకేశ్వరం నుంచి భైంసాకు వెళ్లే రహదారిపై సేవాలాల్ తండాకు చెందిన రైతు పవార్ టీకా రాం రోడ్డుపై వరి ధాన్యం పోయడంతో బుధవారం రాత్రి రాయాపూర్ కాండ్లీ గ్రామానికి చెందిన జాదవ్ విరాబాయి-వెంకటేశ్ దంపతులు కింద పడి గాయపడ్డారు. వెంటనే దంపతులను భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారు చికిత్సపొందుతున్నారు. వెంకటేశ్ ఫిర్యాదు మేరకు పవార్ టీకారాంపై కే సును నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

మందమర్రిరూరల్: పట్టణంలోని ప్రాణహిత కాలనీ రోడ్డుపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యాదగిరి శ్రీకాంత్ (24) తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం.. శ్రీకాంత్ ప్రాణహిత కాలనీ నుంచి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్ తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని అంబులెన్సులో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

'నేతకానిలపై ఎమ్మెల్యే వైఖరి సరికాదు'

గుడిహత్నూర్: నేతకానిలను మాల నేతకానిలుగా పరిగణించాలని చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి సీఎం రేవంత్‌రెడ్డికి నివేదించడం సరికాదని నేతకాని మహర్ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవీందర్ అన్నారు. మండల కేంద్రంలో నేతకాని యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మహేశ్ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేతకానిలపై ఎమ్మెల్యే వైఖరి సరికాదన్నారు. నేతకానిల ఓటు బ్యాంకుతోనే గెలిచాననే విషయాన్ని వివేక్ వెంకటస్వామి మరిచి వారిపై కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. సురేశ్, శంకర్, రవి, సంతోశ్, తిరుపతి, రజనీకాంత్ పాల్గొన్నారు.

బాసరకు చేరిన రథయాత్ర

బాసర: కంచి కామకోటి పీఠం నుంచి అయోధ్యకు వెళ్తున్న శ్రీరామ రథయాత్ర గురువారం బాసరకు చేరుకుంది. అర్చకులు, ఆలయ వైదిక సభ్యులు రథయాత్రకు ఘన స్వాగతం పలికారు.

తుదిదశకు ఉద్యోగ ప్రక్రియ

- 2008 డీఎస్సీ అభ్యర్థులకు తాత్కాలిక పద్ధతిన కొలువు
- మరోసారి వివరాలు పరిశీలించిన ఉన్నతాధికారులు



ప్రక్రియ పరిశీలిస్తున్న ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: 2008 డీఎస్సీ అన్ సక్సెస్‌ఫుల్ అభ్యర్థుల తాత్కాలిక ఉద్యోగ ప్రక్రియ తుదిదశకు వచ్చింది. ఇప్పటికే అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించిన విద్యాశాఖాధికారులు మరోసారి పరిశీలన చేపట్టారు. గురువారం వరంగల్ ఆర్జేడీ, అబ్జర్వర్ సత్యనారాయణరెడ్డి డీఈవో కార్యాలయంలో అభ్యర్థుల వివరాలను పరిశీలించారు. 2008 డీఎస్సీలో 70:30 లిస్టులో పేర్లు ఉండి ఉద్యోగం పొందని బీఎడ్ అభ్యర్థులకు ఇటీవల ప్రభుత్వం తాత్కాలిక పద్ధతిన ఉద్యోగం కల్పించేందుకు నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో 135 మంది అభ్యర్థులు ఉన్నట్లు విద్యా శాఖాధికారులు గుర్తించారు. ఇటీవల సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టగా ఆదిలాబాద్ నుంచి 13 మంది, కుమురం భీం ఆసిఫాబాద్ నుంచి 10, మంచిర్యాల నుంచి 26, నిర్మల్ నుంచి 15 మంది అభ్యర్థులు హాజరయ్యారని, ఇందులో మంచిర్యాల జిల్లాకు చెందిన ఇద్దరు డీఎడ్ అభ్యర్థులు ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. అయితే డీఎస్సీ 2008 లిస్టులో 30 శాతం తొలగించబడిన బీఎడ్ అభ్యర్థులకు న్యాయం చేయాలని కోర్టు ఆదేశించింది. ఈ మేరకు వారికి ప్రభుత్వం తాత్కాలిక పద్ధతిన ఉద్యోగం కల్పించనుంది. 16 సంవత్సరాల తర్వాత బీఎడ్ అభ్యర్థులకు కొలువులు దక్కనున్నాయి. పరిశీలన కార్యక్రమంలో డీఈవో ప్రణీత, సూపరింటెండెంట్లు భోజన్న, మమత, విద్యాశాఖ ఉద్యోగులు, సిబ్బంది శ్రీహరిబాబు, తుషార్, సుకుమార్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి క్రీడోత్సవాలు



ట్రోఫీ అందుకుంటున్న భద్రాచలం జట్టు



ట్రోఫీ అందుకుంటున్న ఉట్నూర్ జట్టు

- ఓవరాల్ చాంపియన్‌గా నిలిచిన భద్రాచలం జట్టు
- ద్వితీయస్థానంలో నిలిచిన ఉట్నూర్ జట్టు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి 5వ గిరిజన క్రీడోత్సవాలు గురువారంతో ముగిశాయి. హోరాహోరీగా సాగిన అథ్లెటిక్స్ పోటీల్లో భద్రాచలం జట్టు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించగా ఉట్నూర్ జట్టు ద్వితీయస్థానంలో నిలిచింది. ముగింపు కార్యక్రమానికి కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ట్రెయినీ కలెక్టర్ అభిజ్ఞాన్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ముఖ్యఅతిథులుగా హాజరై విజేతలకు ట్రోఫీలు, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోటీల్లో 1600 మంది క్రీడాకారులు పాల్గొనడం అభినందనీయమన్నారు. క్రీడల్లో రాణించేందుకు అన్నిరకాల సహకారాలు అందిస్తామన్నారు. పీవో మాట్లాడుతూ క్రీడాకారులు ఇదే స్ఫూర్తితో ముందుకెళ్లాలన్నారు. ఈ సందర్భంగా జాతీయస్థాయి వాలీబాల్ క్రీడాకారుడు వరంగల్ జిల్లాకు చెందిన వెంకట నారాయణను సన్మానించారు. అంతకు ముందు విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఎస్‌వో పార్థసారథి, నిర్మల్ జిల్లా గిరిజన క్రీడల అధికారి రమేశ్, ఆయా జిల్లాల పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

హాకీ రాష్ట్రస్థాయి పోటీల్లో విజేత



విజేతగా నిలిచిన ఆదిలాబాద్ జట్టు

ఆదిలాబాద్: ఎస్జీఎఫ్ అండర్-17 బాలుర హాకీ రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు విజేతగా నిలిచింది. సంగారెడ్డిలోని అంబేద్కర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో వరంగల్ జట్టుపై 3-0 గోల్స్ తేడాతో సత్తాచాటి విజేతగా నిలిచిందని సెక్రెటరీ కాంతారావు తెలిపారు. జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలూరి గోవర్ధన్ రెడ్డి, పార్థసారథి తదితరులు గురువారం జట్టుకు అభినందనలు తెలిపారు.

గంజాయి సాగు కేసులో ఒకరికి పదేళ్ల జైలు

ఆసిఫాబాద్: గంజాయి సాగు చేస్తున్న కేసులో ఒకరికి పదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.లక్ష జరిమానా విధిస్తూ జిల్లా సెషన్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ గురువారం తీర్పుచెప్పారు. జైనూర్ సీఐ రమేశ్ కథనం ప్రకారం..సిర్పూర్(యు) మండలం పగిడి గ్రామానికి చెందిన ఆత్రం అమృతరావు తన వ్యవసాయ క్షేత్రంలో గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారంతో 2021 అక్టోబర్ 12న అప్పటి ఎస్సై విష్ణువర్ధన్ తనిఖీ చేయగా గంజాయి మొక్కలు లభ్యమయ్యాయి. సీఐ హనూక్ కేసు దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. పీపీ జగన్మోహనరావు సాక్షులను విచారించి నేరం రుజువు చేయడంతో ఈ మేరకు న్యాయమూర్తి తీర్పు నిచ్చారు. నిందితుడికి శిక్షపడేలా కృషి చేసిన డీఎస్పీ కరుణాకర్, సీఐ రమేశ్, ఎస్సై రామకృష్ణ, కోర్టు లైజనింగ్ అధికారి రామ్‌సింగ్, కోర్టు సిబ్బందిని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అభినందించారు.

ఒకరిని గాయపర్చిన కేసులో ఐదుగురికి జైలు

ఆదిలాబాద్‌టౌన్: పాతకక్షలు మనసులో పెట్టుకుని ఒకరిని గాయపర్చిన కేసులో ఐదుగురికి మూడు నెలల జైలుశిక్షతోపాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ పీసీఆర్ కోర్టు జడ్జి దుర్గారాణి తీర్పు నిచ్చినట్లు లైజన్ అధికారి గంగాసింగ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన పవార్ కనకయ్య కళ్లలో కారంపొడి చల్లి 2019 ఏప్రిల్ 17న ఆయన బంధువులు ఒర్సు సురేశ్, పీరాజీ, గంగయ్య, సాయి, ఒల్లెపు సత్తయ్యలు దాడికి పాల్పడ్డారు. బాధితుడు మావల పోలీసులకు ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్సై ముజాహిద్ కేసు దర్యాప్తు చేశారు. పీపీ నవీన్‌కుమార్ 8 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు చేశారు. ఈ మేరకు జడ్జి తీర్పు వెలువరించారు.